# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 155. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.01.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## ఇండ్లను కూల్చబోం..

అమృత్ తెలంగాణ: హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, సుందరీకరణ పనుల్లో ఎక్కడా నివాసాలను తొలగించబోమని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రా ఆరు చెరువులను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా హైడ్రా కమిషనర్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో ఆరు చెరువులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి చెరువుల పునరుద్ధరణ పనులకు సహకరించాలని కోరారు. చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తున్నదని వారికి వివరించారు. ఈ బాధ్యతను హైడ్రాకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని, అందుకు మిగతా ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. స్థానికుల నుంచి మంచి సహకారం అందడం ఆనందించదగ్గ విషయమని, త్వరలోనే చెరువుల్లో జీవకళను అందరూ చూస్తారని భరోసా కల్పించారు.

## ఏసీబీ వలలో హెడ్ మాస్టర్

కొత్తగూడెం : అమృత్ తెలంగాణ:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని కూలిలైన్ హై స్కూల్ హెడ్ మాస్టర్ రవీందర్ రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టు బడ్డారు.అధికారులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.కొత్తగూడెం పట్టణంలోని కూలిలైన్ హైస్కూల్ పిల్లలకు ప్రభుత్వం సెల్ఫ్ డిఫెన్స్ కోసం కరాటే నేర్పిస్తోంది.అందులో భాగంగా కరాటే శిక్షకురాలు 3 నెలల పాటుక్లాసులు చెప్పాల్సి ఉంటుంది.ఈ క్లాసులకు నెలకు రూ.10వేలు చొప్పున మూడు నెలలకు రూ.30 వేల జీతంఇవ్వాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ జీతాన్ని హెడ్మాస్టర్ అకౌంట్‌లోకి వేయగా.. వాటిని కరాటే మాస్టర్‌కు ఇచ్చేందుకు పలు ధపాలుగా తిప్పించుకున్నారు. ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దాంతో కరాటే శిక్షకురాలు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం కరాటే శిక్షకురాలు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌కు డబ్బులు ఇస్తున్న సమయంలో ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# బెదిరిస్తే భయపడం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వల్లే రాష్ట్రంలో మిగిలిన మెట్రో ప్రాజెక్టుకు అనుమతి లభించడంలేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'రాష్ట్రానికి ప్రత్యేకంగా తీసుకొచ్చిన ప్రాజెక్టులు ఏంటో చెప్పండి కిషన్ రెడ్డి గారూ నోరు పెద్దది చేసుకుని బెదిరిస్తే భయపడేవారు ఇక్కడెవరూ లేరు' అని ఆయన కిషన్‌రెడ్డికి కౌంటరిచ్చారు. మెట్రో, ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టులను కిషన్‌రెడ్డి అడ్డుకొంటున్నారని ఆరోపించారు. సబర్మతి సుందరీకరణను ప్రశంసించిన కిషన్‌రెడ్డి, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును మాత్రం వ్యతిరేకిస్తున్నారని అన్నారు. తాము ప్రధాని మోదీ వ్యక్తిగత ఆస్తుల్ని అడగడం లేదని, రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్లిన నిధుల్లో రాష్ట్ర వాటా ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులన్నీ యూపీ, బీహార్‌లకే ఇస్తోందని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మన మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆ తర్వాత తనను కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించారు. తెలంగాణలో ప్రాజెక్టుల గురించి కేంద్రమంత్రి వర్గంలో ఎప్పుడైనా ప్రస్తావించారా? అని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎన్ని ప్రాజెక్టులను మీరు రాష్ట్రానికి తీసుకొచ్చారని నిలదీశారు. కేంద్ర మంత్రి సైంధవుడి పాత్ర పోషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే, ఈ ప్రాజెక్టులన్నింటికీ అనుమతులు తీసుకొని హైదరాబాద్‌కు రావాలన్నారు. గతంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఎన్ని కోట్ల మందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కేంద్రం తెలంగాణకు ఎన్ని ఇండ్లు ఇచ్చిందో చెప్పాలన్నారు. వ్యవసాయంలో నల్ల చట్టాలు తీసుకొచ్చిన కేంద్రం వందల మంది రైతులను బలితీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు ఉన్నాయా? అంటూ అవహేళన చేయడం దేనికి సంకేతమన్నారు. తాము ఢిల్లీకి వెళ్లి లిక్కర్ దందాలు చేయడం లేదని, రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం వెళ్తున్నామని బీఆర్‌ఎస్ నేతలనుద్దేశించి ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వల్లే రాష్ట్రానికి ప్రాజెక్టులు రావడంలేదన్నారు. రాష్ట్రాలపై ఒకే భాషను బలవంతంగా రుద్దొద్దని సూచించారు. మన మాతృభాష తెలుగు పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వం అన్ని జీవోలను తెలుగులో కూడా ఇస్తోందని తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గవని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెబుతున్నారని, కానీ పెరుగుతాయని మాత్రం ఎక్కడా చెప్పలేదన్నారు. డీలిమిటేషన్ పేరిట దక్షిణాదికి అన్యాయం చేసేందుకు బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఉత్తరాదిలో సీట్లు పెంచుకుని ఆ రాష్ట్రాల సీట్లతోనే అధికారంలోకి రావాలని కమలానాథులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే నిధులన్నీ ఉత్తరాది రాష్ట్రాలకు ఇస్తూ.. దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీట్లు రాని దక్షిణాది రాష్ట్రాలను మాత్రం నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

పదవులు రాలేదని నిరుత్సాహ పడొద్దు

పదవులు రాలేదని కాంగ్రెస్ నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా పదవులు వస్తాయన్నారు.'నాలుగైదేండ్లుగా జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చాం. పార్టీలో నమ్మకంగా ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చాం. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నాం. మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫీడ్‌బ్యాక్ తీసుకొని పదవులిస్తాం. ప్రస్తుతం రెండేండ్ల




కాలానికి కార్పొరేషన్ చైర్మెన్లుగా పదవులు ఇచ్చాం. మార్చి 10 లోపు జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలి' అని సీఎం కోరారు. 'మంచిని మైకులో చెప్పాలి.. చెడును చెవిలో చెప్పాలి' అందుకు రివర్స్‌గా చెబుతున్నారని క్యాడర్‌నుద్దేశించి అన్నారు. 'రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకూ మనం విశ్రమించొద్దు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవద్దు. రాహుల్ ప్రధాని అయితే, దేశం అభివృద్ధి అవుతుంది. కాంగ్రెస్‌కు తక్కువ.. ఎక్కువ.. అనే తారతమ్యాల్లేవు. అనుభవజ్ఞులైన ఇద్దరిని ఇప్పటికే రాజ్యసభకు నామినేట్ చేశాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో కులగణన అనేది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే అత్యధిక పన్నులు కడుతున్న రాష్ట్రం తెలంగాణ. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంటుంది' అని అన్నారు.

దేశాన్ని కాపాడేది కాంగ్రెస్సే: మీనాక్షి నటరాజన్

స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్సే దేశాన్ని కాపాడేది కాంగ్రెస్సే అని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తల త్యాగంతో ఏర్పడిందన్నారు. సామాజిక న్యాయం కోసం, మార్పు కోసం పార్టీ కార్యకర్తలు కష్టపడ్డారని అన్నారు. మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రతి కార్యకర్త పేద వాడి కోసం పని చేయాలనీ, వారి ముఖంలో నవ్వులు చూడాలని సూచించారు. అప్పుడే మనం పని చేసినట్టు అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామానికి వెళ్లి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవన్నారు. తమ పార్టీలోనే ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందన్నారు. పార్టీ పటిష్టతకు, రాజ్యాంగ పరిరక్షణకు అందరం కలిసి పని చేస్తామని తెలిపారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. సమావేశంలో పీఏసీ, పీఈసీ సభ్యులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల చైర్మెన్లు, కార్పొరేషన్ చైర్మెన్లు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అధికార ప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తెలంగాణ నూతన ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్వాగతం పలికారు.

# సన్నగిల్లుతున్న ఆశలు

## జీపీఆర్ మిషన్ స్కాన్‌లో కార్మికుల ఆనవాళ్లు!

## మట్టిలో కూరుకుపోయినట్టు ప్రచారం?

## నేడో రేపో ఉత్కంఠకు తెర

## పనిలో 11 రెస్క్యూ టీంలు, మూడు షిఫ్టులు, షిఫ్టుకు 100 మంది

## బోర్ మిషన్‌ను తునకలు చేసి బయటకు పంపుతున్న టీం సభ్యులు

## ఇంకా బురద నీరు రావడంతో ముందుకు వెళ్లలేకపోతున్న రెస్క్యూ టీం

## పుకార్లు నమ్మొద్దన్న కలెక్టర్



మహబూబ్‌నగర్ :అమృత్ తెలంగాణ: శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం (ఎల్‌ఎల్‌బీసీ)లో చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు మరింత వేగం పుంజుకున్నాయి. సహాయక చర్యల్లో శుక్రవారం కొంత పురోగతి వచ్చినట్టు సమాచారం. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ఎనిమిది రోజుల కిందట జరిగిన ప్రమాదంలో 8 మంది గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన నాటి నుంచి కార్మికులను, ఉద్యోగులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేపట్టింది. అన్ని రకాల రక్షణ, సహాయక టీమ్‌లను రప్పించింది. కేంద్ర బృందం వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రమాద స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) రంగంలోకి దిగింది. కూరుకుపోయిన వారి స్థితిని తెలుసుకునే ప్రయత్నంలో ప్రత్యేక బృందం జీరో గ్రావిటీ రాడార్ (జీపీఆర్) టెక్నాలజీని ఉపయోగించింది. మిషన్ ఆధారంగా బృందం సభ్యులు టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేశారు. మట్టిలో ఉన్న వారు మూడు మీటర్ల లోతులో కూరుకుపోయినట్టు పరికరాలు గుర్తించినట్టు తెలుస్తోంది. దీంతో ఐదు మృతదేహాలను గుర్తించినట్టుగా వార్తలు బయటకు వచ్చాయి. వీటిని ఎవరూ అధికారికంగా ధ్రువీకరించడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. గల్లంతైన వారిని వెలికి తీయడం కోసం బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని తెలిపారు.

క్లిష్టంగా రెస్క్యూ ఆపరేషన్ ..: కలెక్టర్ ప్రకటన

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ ఇంకెన్ని రోజులకు తెలుస్తుందో తెలియడం లేదు. 11 రెస్క్యూ టీంలు మూడు షిఫ్టుల్లో షిఫ్టుకు 100 మంది చొప్పున పని చేస్తున్నాయి. అయినా నిమిషానికి 5 వేల లీటర్ల నీరు వస్తుండటంతో పనులకు ఆటంకంగా మారింది. అయితే మూడు మీటర్ల లోతులో కార్మికుల ఆనవాళ్లు గుర్తించామని జరుగుతున్న పుకార్లను నమ్మొద్దని కలెక్టర్ ప్రకటన చేశారు. శుక్రవారం జేపీ బేస్ క్యాంప్ ఆఫీస్‌లో సహాయక బృందాల అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్పీ, ఇరిగేషన్ స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి సుఖేందు, టీఎస్ఎస్పీడీసీఎల్ సిఎండి ముషరఫ్ ఆలీ, ఆర్మీ అధికారులు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, కల్నల్ అమిత్ కుమార్ గుప్తా, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి బలరాం, హైడ్రా అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులతో టన్నెల్ కొనసాగుతున్న సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నాలు తీవ్రంగా కొనసాగిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వైద్య సిబ్బంది ఆక్సిజన్ అందుబాటులో ఉంచారని, టన్నెల్‌లో 12 బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని వివరించారు. వాటిలో ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఫైర్ సర్వీసెస్, నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, హైడ్రా, సౌత్ సెంట్రల్ రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్, బృందాలు నిరంతరం సమన్వయంతో సహాయక చర్యలు వేగవంతం చేసినట్టు చెప్పారు. పక్కా ప్రణాళికతో సహాయక చర్యలకు కావాల్సిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటూ నీటిని పంపుల ద్వారా బయటికి తరలిస్తూ, ప్లాస్మా గ్యాస్ కట్టర్ ద్వారా శిథిలాలను తొలగిస్తున్నట్టు తెలిపారు. వీలైనంత త్వరగా కన్వేయర్ బెల్ట్‌ను ఉపయోగంలోకి తీసుకొస్తామని, బురదను తీసేందుకు ఎస్కావేటర్లను సిద్ధం చేసినట్టు వివరించారు. ప్రత్యేక కెమెరాలు, సెన్సార్ల ద్వారా లోపలి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్మికుల క్షేమంపై రోజురోజుకూ ఆందోళన పెరుగుతోంది. ప్రభుత్వం కూడా వారిని ఎలాగైనా రక్షించాలని శతవిధాలా ప్రయత్నిస్తోంది.

కార్మికులను గుర్తించినట్టు ప్రచారం

జీపీఆర్ మిషన్ స్కాన్‌లో కార్మికుల ఆనవాళ్లు గుర్తించినట్టు నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చెబుతున్నట్టు ప్రచారం జరిగింది. జలపాతాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇక్కడే మిషన్ ద్వారా కార్మికుల అవశేషాలను గుర్తించినట్టు చెబుతున్నారు. ఐదుగురిని గుర్తించినట్టు ప్రచారం జరిగింది. శనివారం సాయంకాలం నాటికి కార్మికులను బయటకు తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, సజీవంగానా? మృతదేహాలుగానా? ఎలా అనేది తెలియదు. ఉత్కంఠ కొనసాగుతోంది.

ఇంకెన్నాళ్లు..?

సొరంగం వరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు అధికారులు వచ్చి పోతున్నారు.. 24 గంటలు సొరంగంలో సహాయక చర్యల్లో బృందాలు ఉన్నాయని, ఘటనా స్థలానికి రెస్క్యూ టీంలు చేరుకున్నాయని చెబుతున్నారు. ఇలా 8 రోజులుగా చెబుతూనే ఉన్నారు. కార్మికులను మాత్రం గుర్తించడం లేదని పలువురు తెలిపారు. మంత్రులు సుడిగాలి పర్యటన చేస్తున్నారు తప్ప పనులు వేగం పెంచడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని ఆయా పార్టీల నాయకులు విమర్శించారు. గల్లంతైన కార్మికులను వెలికి తీయడానికి ఇంకెంత కాలం పడుతుందోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

# వర్సిటీల స్వయంప్రతిపత్తిని కాలరాస్తున్న యూజీసీ

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని, వాటి హక్కులను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కాలరాస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని పలువురు విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, మేధావులు అభిప్రాయపడ్డారు. ఇటీవల తెలంగాణ విద్యాకమిషన్ ఆధ్వర్యంలో యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలపై సెమినార్‌ను నిర్వహించింది. అందులో చేసిన తీర్మానాన్ని శుక్రవారం విడుదల చేసింది. ఎమ్మెల్సీ కోదండరామ్, ప్రొఫెసర్లు తిరుపతిరావు, మురళి మనోహర్, రమామెల్కోటే, డి నరసింహరెడ్డి, పద్మజషా, కె లక్ష్మినారాయణ, ముత్యంరెడ్డి, విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, సభ్యులు పిఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి, జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి, జి హరగోపాల్, సులేమాన్ సిద్ధిఖీ, శాంతాసిన్హా, ఎస్ సత్యనారాయణ తదితరులు తీర్మానంపై సంతకం చేశారు. విశ్వవిద్యాలయాలు, సిబ్బంది నియామకం, పదోన్నతి కోసం కనీస ప్రమాణాలు ఉన్నత విద్యలో ఉండడం కోసం యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను సిద్ధం చేసిందని తెలిపారు. యూజీసీ ఉన్నత విద్యలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చే గ్రాంట్ల సంస్థ అని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థలకు కనీస ప్రమాణాలను నిర్ణయించే విధులతోపాటు ఇటీవలి కాలంలో రాజకీయ ప్రేరేపిత జోక్యాలతో దాని పరిధికి మించి పాలనా నిర్మాణాల్లోకి మరింత చొరబడిందని విమర్శించారు. ఇదే సమయంలో గ్రాంట్ ఇవ్వడం వంటి విధులను తీవ్రంగా తగ్గించిందని స్పష్టం చేశారు. ఇది ప్రముఖ ఉన్నత విద్య/పరిశోధన సంస్థలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. వర్సిటీల వీసీల నియామకం కోసం సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీని ఏర్పాటు చేసే అధికారాన్ని రాష్ట్రాల గవర్నర్లకు అప్పగించడం అత్యంత వివాదాస్పద ప్రతిపాదన అని విమర్శించారు. వారు కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు రాజ్యాంగంలోని సమాఖ్య నిర్మాణం కింద దేశంలోని అన్ని రాష్ట్రాలూ వాటి స్వంత చట్టాలను కలిగి ఉన్నాయని వివరించారు. వాటి ఆధారంగా రాష్ట్ర వర్సిటీలు నిర్వహించబడతాయని తెలిపారు. వర్సిటీలు స్వయంప్రతిపత్తిని కలిగి ఉ




న్నాయని పేర్కొన్నారు. గవర్నర్లకు వీసీలను నియమించే అధికారాన్ని అప్పగించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర గణనీయంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్యవాదం అనే భావనపైనే యూజీసీ దాడి చేస్తున్నదని విమర్శించారు. ఈ నిర్ణయం వ్యవస్థను కేంద్రీకరిస్తుందని తెలిపారు. గవర్నర్లు స్వయంగా వీసీలను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వారి అధ్యక్షతన అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపిక కమిటీల్లో గవర్నర్ మరో విద్యానామినీగా కలిగి ఉంటారని వివరించారు. తమిళనాడు, కేరళ వంటి అనేక రాష్ట్రాలు ఇప్పటికే యూజీసీ ప్రతిపాదిత మార్గదర్శకాలపై ప్రజాభిప్రాయాన్ని తీసుకుని అభ్యంతరాలను లేవనెత్తుతూ సంబంధిత అసెంబ్లీల్లో తీర్మానాలను ఆమోదించాయని గుర్తు చేశారు. వర్సిటీల స్వయంప్రతిపత్తిని క్షీణింపజేసే విధాన పాలనను అమలు చేస్తూ ఆర్థిక బాధ్యతల నుంచి యూజీసీ తప్పుకోవడం లాంటి చర్యలు ఉన్నత విద్యావ్యవస్థను మరణశిక్ష లాంటిదని తెలిపారు.

# మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో అధికారంలో ఉన్న ఇందిరమ్మ ప్రభుత్వం మహిళా సాధికారతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందనీ, మహిళా సాధికారతకు అనువైన వాతావరణాన్ని సృష్టించడానికి సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా కృషిచేస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఉమెన్స్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్ అండ్ బీ2బీ ఎక్స్‌పో – 2025లో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాణి రుద్రమ దేవి నుంచి మొదలుకొని నేటి వ్యాపారవేత్తల వరకు మహిళలు సమాజానికి వెన్నెముకగా ఉన్నారని గుర్తుచేశారు. వారి సాధికారత సామాజిక పురోగతి మాత్రమే కాదనీ, ఆర్థికాభివృద్ధికి కీలకమని నొక్కి చెప్పారు. మహిళా సాధికారత కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వివరించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఐదేండ్లలో లక్ష మంది మహిళా కోటీశ్వరులను తయారు చేయడానికి ప్రభుత్వ చేయూతనిస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, నైపుణ్యాభివృద్ధి అందజేస్తున్నామని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రం ఆధ్వర్యంలో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌ల కోసం తొలి ఇంక్యుబేటర్ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. మహిళల నేతృత్వంలోని వ్యాపారాలకు టీ–ఐడీఈఏ ప్రత్యేక ప్రోత్సాహాలు అందిస్తున్నట్టు తెలిపారు. పాడి, వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు మద్దతిస్తున్నట్టు చెప్పారు. ఐటీ, సౌరశక్తి, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న తీరును వివరించారు.

# ఇంటర్ పరీక్షలను పటిష్టంగా జరపాలి

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఈనెల ఐదో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పటిష్టంగా జరపాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఆదేశించారు. ఈనెల 25 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆమె శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ,కమిషనర్ ఆఫ్ పోలీసులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, ఇంటర్ బోర్డు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ ఈనెల ఐదు నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతను పటిష్టం చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లను కోరారు. ప్రశ్నాపత్రాలను ఆయా స్ట్రాంగ్ రూమ్‌ల్లో నుంచి పోలీస్ స్టేషన్‌లోకి తరలించే ముందు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్లలో పటిష్టమైన బందోబస్తు ఉండాలని కోరారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్‌ని విధించాలని అన్నారు. విద్యార్థులు, పరీక్షా సిబ్బంది ఎటువంటి ఎలక్ట్రిక్ గ్యాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోపలికి అనుమతించకుండా తనిఖీలు చేసి, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరెందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య శాఖ ద్వారా ఓఆర్ఎస్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వికలాంగులకు, అంధ విద్యార్థులకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేశారని చెప్పారు. 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

# కస్టమర్ రైట్స్ ఆర్గనైజేషన్ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గా ఇర్ఫాన్



నూతన జిల్లా అధ్యక్షునిగా నియామక పత్రాలు అందుకుంటున్న షేక్ ఇర్ఫాన్



ఆదిలాబాద్ గౌరవ అధ్యక్షుడు ఎం శ్రీకర్ అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు



నూతన సభ్యునిగా రాళ్ల బండి అనిల్ ను అభినందిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : కస్టమర్ రైట్ ఆర్గనైజేషన్ నూతన అధ్యక్షునిగా షేక్ ఇర్ఫాన్ ఎన్నికయ్యారు రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు చేతుల మీదుగా ఇర్ఫాన్ కు నియామక పత్రాన్ని అందజేశారు శుక్రవారం ఆదిలాబాద్ మేస్త్రి భవన్ లో సంస్థ సమావేశం నిర్వహించారు నూతన జిల్లా అధ్యక్షునిగా షేక్ ఇర్ఫాన్ తో పాటు 40 మంది జిల్లా కార్యవర్గం సభ్యులుగా ఎన్నుకున్నారు వారికి నియమాలు పత్రాలు అందజేశారు రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు మాట్లాడుతూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని నూతన అధ్యక్షుడిని కోరారు జిల్లాలో వినియోదారులకు తమ హక్కులపై అవగాహన కలిగేటట్లు చూడాలని పేర్కొన్నారు షేక్ ఇర్ఫాన్ నూతన అధ్యక్షునిగా మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లాలో ప్రతి వినియోదారునికి హక్కులపై అవగాహన నా సాయ శక్తుల ప్రయత్నం చేస్తానని మరియు నూతన అయినటువంటి కమిటీ ద్వారా కూడా జిల్లాలో సంస్థకు మంచి పేరు తీసుకొస్తానని మీకు హామీ ఇస్తున్నారని తెలిపారు రాష్ట్రస్థాయి ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి శివ ఈ కార్యక్రమంలో అదిలాబాద్ జిల్లాలో గౌరవ అధ్యక్షుడిగా ఎం శ్రీకర్ పి వెంకటేష్ ఉమెన్ సింగ్ సప్న రమా చిట్టెమ్మ రాళ్లమండి అనిల్ తదితరులు పాల్గొన్నారు

# నర్సాపూర్ (జి)పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.....

**విలేకరులను నిరాకరించిన రూరల్ సీఐ కృష్ణ...ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన ఇప్పటికీ అరెస్టు చేయకపోవడంపై పలు అనుమానాలు....మండల కేంద్రంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆగ్రహం వెంటనే ఏర్పాటు చేయాలి ఎస్పీ ఆదేశాలు**

నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి): ఫిబ్రవరి 28 అమృత్ తెలంగాణ నర్సాపూర్ (జి ) మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ను శుక్రవారం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా, శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి కేసుల పురోగతిపై వివరాలను ఎస్సై సాయికిరణ్, ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ రావడంతో వార్త కవరేజీకి పోలీస్ స్టేషన్ వెళ్లిన మండల విలేకరులను నిర్మల్, రూరల్ సీఐ కృష్ణ, లోపలికి వెళ్లకుండా నిరాకరించారు. దీంతో విలేకరులు వెనుతిరిగారు. ఇటీవల మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలపై ఉపాధ్యాయులు అసభ్య ప్రవర్తన పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినప్పటికీ అరెస్ట్ చేయకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి నేరాల కట్టడిపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



నర్సాపూర్ జి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ జానకి షర్మిల,

# ఆపదలో ఉన్నవారికి ఎర్ర రక్త కణాలు దానం చేసినా బొరిగాం సాయిరెడ్డి...

నిర్మల్ జిల్లా బైంసా ఫిబ్రవరి 28 అమృత్ తెలంగాణ పేషెంట్ నేమ్. అశ్వినీ 3 సంవత్సరాల పాపా కు ఎమర్జెన్సీ ఓ పాజిటివ్ ఎర్ర రక్త కణాలు అవసరం ఉండగా అరుష హస్పిటల్ డాక్టరు నరేష్, చెప్పా గానే ఫోన్ చేసిన వెంటనే బోరిగం నుండీ సాయిరెడ్డి స్పందించి జీవందన్ బ్లడ్ బ్యాంక్ రక్తనిధి కేంద్రానికి వచ్చి తన ఓ పాజిటివ్ రక్తం ఇవ్వడం జరిగింది . ఒక నిండు ప్రాణాన్ని కాపాడడం జరిగింది. రక్తం ఇచ్చిన దాత సాయి రెడ్డి ఇప్పటి వరకూ పదిహేను మంది రోగులకు రక్తం ఇవ్వడం జరిగింది..ఇలాగానే ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రక్తదానం యొక్క ప్రాధాన్యత రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. 18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన




ప్రతి వ్యక్తి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటవచ్చు. ఈ సంఘటన ద్వారా సాయి రెడ్డి, చూపించిన ఆదర్శం సమాజంలో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుంది.......ఆపదలో మేమున్నాం అంటున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ అండ్ టీం భైంసా..

# ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.





విద్యార్థులకు అన్నం పెడుతున్న అదనపు కలెక్టర్ ఫై జాన్ అహ్మద్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులందరికీ నాణ్యమైన చదువుతో పాటు మెరుగైన వసతులను కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి నిర్మల్ పట్టణంలోని నటరాజ్ నగర్ ప్రభుత్వ వెనకబడిన కులాల బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్ అదనపు కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ నిర్వహణకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ స్వయంగా భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి బాగోగులను తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ అన్నిపూటల మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల చదువుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ, ఖచ్చితమైన సమయపాలన పాటిస్తూ చక్కగా చదువుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన కులాల అధికారి వి. రాజేశ్వర్ గౌడ్, ఎస్ డబ్ల్యూఓ డి. లత, ఎస్ డబ్ల్యుఓ ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు బండ అనిల్ కుమార్ రైల్వే స్టేషన్లో లొ మరియు బస్టాండ్ లో మహా అన్నదాన కార్యక్రమం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు బండ అనిల్ కుమార్ రైల్వే స్టేషన్లో లొ మరియు బస్టాండ్ లొ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో లిట్రస్ట్ వ్యవస్థాపకులు బండ అనిల్ కుమార్ మరియు ట్రస్ట్ కమిటి సభ్యులు సామల రవి మని,బండ మల్లికార్జున్, రాజు యాదవ్, బండ సునీల్ కుమార్, అయతీ సుమంత్,కుర్ర నరేష్, కచ్చా అరుణ్ సింగ్, కూరపాటి శివమని ,కౌశిక్ రెడ్డి, అనుముల ఉ షాన్న,సుధాకర్,పొట్టుపుల విజయ్



అన్నదానం చేస్తున్న దృశ్యం

మరియూ భానోత్ మల్లేష్ పాల్గొనడం జరిగింది...

# ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ శుక్రవారం సాయంత్రం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలతో సిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, జిల్లాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులందరికీ శిక్షణ కల్పించాలన్నారు. జిల్లాల వారీగా ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల సంఖ్య, పరీక్షా కేంద్రాల సంఖ్య, పరీక్షల నిర్వహణలో పాల్గొనబోయే సిబ్బంది, తదితర వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలను అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. పరీక్షల ప్రక్రియ పూర్తయింతవరకు అన్ని సందర్భాలలో పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల ఎస్పీలను సిఎస్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలోని జిరాక్స్ దుకాణాలను మూసివేసి, 144 సెక్షన్ ను అమలు పరచాలన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం నూతన నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీని కల్పించినట్లు తెలిపారు. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ గడువు ముగుస్తుంది తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో సమీక్షిస్తూ, జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో కలుపుకొని 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 6571 మంది ప్రథమ సంవత్సర, 6562 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం కలిపి 13133 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. మార్చి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ల అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. మార్చి 31 వ తేదీతో లే అవుట్ల దరఖాస్తుల రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. గడువు ముగిసిన తర్వాత మళ్ళీ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండదని, కావున దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎస్పి జానకి షర్మిళ, అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, డిఈఓ పి. రామారావు, డిపిఓ శ్రీనివాస్, డి ఎం ఆర్టిసి ప్రతిమారెడ్డి, డిఎంహెచ్ఓ రాజేందర్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.





సమావేశం హాజరైన జిల్లా అధికారులు మరియు మైనార్టీ నాయకులు

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ముస్లిం సోదరులు ఉపవాసం ఉండే సమయాల్లో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ముస్లిం మత పెద్దలతో ఎస్పీ జానకి షర్మిల తో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 2 నుంచి రంజాన్ మాసం ఉపవాసాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల దగ్గర నిరంతరం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, మసీదుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ ను చల్లాలి సూచించార. ప్రార్థనా సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, ప్రార్థనా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణ సముదాయాలను అదనపు సమయాల్లో తెరిచి ఉండే విధంగా అనుమతించడం జరుగుతుందన్నారు. ముస్లింల సహాయార్థం టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేస్తామని తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారులు త్వరితగతిన స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. రంజాన్ పండుగనాడు అన్ని ఈద్గాలలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈద్గాలలో త్రాగునీరు, షామియానాలు, ఇతర ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. ఈద్గా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని మతాల పండుగలను సహోదర భావంతో జరుపుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, రంజాన్ మాసంలో ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మసీదుల వద్ద ప్రార్థనా సమయాల్లో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దుకాణాలను అదనపు సమయాల్లో తెరిచి ఉంచేందుకు అనుమతులు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, ముస్లిం మత పెద్దలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా 2కే రన్ ర్యాలీ ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు 2 కే రన్ నిర్వహించారు. ఈ 2కే రన్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించే విధంగా అవగాహన కల్పించేలా నినాదాలు చేస్తూ ఈ 2కే రన్ ర్యాలీ ఎన్ టి ఆర్ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జిల్లాలో ఆర్బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం బ్యాంకుల ద్వారా మహిళలను అన్ని రంగాల్లో పరిపుష్టం చేయడమే అన్నారు. మహిళా సాధికారితకు బ్యాంకులు అనేక రకాలుగా చేయూతను అందిస్తున్నాయని తెలిపారు. ఆయా పథకాలకు, రుణాలకు అర్హులైన మహిళలందరూ వాటిని సద్వినియోగపరచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలకు సంబంధించి ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న అన్ని రకాల పథకాలపై అధికారులు మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్వయం సంఘాలకు చేయూతనివ్వడానికి ఎన్నో రకాల పథకాలు ఉన్నాయని, మహిళా సాధికారిత సాధించడానికి ఈ పథకాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. మహిళలకు పొదుపుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్యాంకుల సహకారంతో మహిళలు వాణిజ్య, వ్యాపార రంగాల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. వివిధ వర్గాల మహిళలు, ట్రాన్స్ జెండర్లు బ్యాంకు ఖాతాలు కలిగి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, జెడ్పి సీఈవో గోవింద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ సుభాష్, వెనుకబడిన తరగతుల అధికారి రాజేశ్వర్ గౌడ్, సిడిపిఓ నాగలక్ష్మి, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ అశోక్ కుమార్, ఎస్ హెచ్ జి ల మహిళలు, బ్యాంకర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# 'కుంభమేళా' రాజకీయం!



అమృత్ తెలంగాణ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు

అమృత్ తెలంగాణ : నలభై ఐదు రోజుల పాటు జరిగిన మహా కుంభమేళా జనవరి 13న మొదలై, ఫిబ్రవరి 26 బుధవారంతో ముగిసింది. 66.21 కోట్ల మంది స్నానాలు ఆచరించారని, రూ.3 లక్షల కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. కుంభమేళా ఏర్పాట్లలో ఏదైనా అసౌకర్యం జరిగి ఉంటే తమను క్షమించాలని ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్ వేదికగా భక్తులను కోరారు. కనీవినీ ఎరగని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ప్రచారం చేయడం, సంఘ్ పరివారం ప్రత్యేక దృష్టి పెట్టి కదిలించటం తదితర కారణాల వల్ల ఈసారి పెద్దసంఖ్యలో జనం కుంభమేళాలో పాల్గొన్నారు. ప్రచారం చేసినంత స్థాయిలో జాగ్రత్తలు, ఏర్పాట్లూ లేకపోవడం వల్ల ప్రయాగరాజ్‌లోనూ, ఢిల్లీలోనూ తొక్కిసలాటలు జరిగి 48 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు, అగ్నిప్రమాదాలు, చిన్న చిన్న తొక్కిసలాటలు, గంటల తరబడి ట్రాఫిక్ రద్దీలు వంటి ఇబ్బందులు అనేకం చోటు చేసుకున్నాయి. ఏర్పాట్లలో విఐపిలకు ఇచ్చినంత ప్రాధాన్యం సామాన్య భక్తులకు ఇవ్వలేదని మొదటి రోజు నుంచీ విమర్శలు వచ్చాయి. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనే సామాన్య భక్తులు తమ సందర్శన ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతను, సాంత్వనను ఆశిస్తారు. తమ విశ్వాసానికి తగ్గట్టుగా పూజాదిక విధులు నిర్వహించి, సంతృప్తి చెందుతారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలక్కుండా తగిన ఏర్పాట్లు చేయడం, అన్ని విధాలా భద్రత కల్పించటం పాలకుల విధి. ఆదిత్యనాథ్ ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు వెచ్చించి, ఏర్పాట్లు చేసింది. ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సెలబ్రిటీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రముఖులు ఎవరు వచ్చినా ఆ వార్తలను విపరీత ప్రచారంలో పెట్టింది. కోట్లాదిమందితో నదీతీరం, క్షేత్రాలూ కిక్కిరిసిపోతున్నాబీ వందల కిలోమీటర్ల మేర రహదారులు స్తంభించిపోయినా ప్రకటనలు హోరెత్తించింది. 'పెద్ద సంఖ్యలో' సమీకరించటంపై చూపిన శ్రద్ధాసక్తులు జనం పడే ఇబ్బందులపై ఇసుమంత కూడా కనపరచలేదు. అవకాశానికి మించినంత జనం వస్తున్నా తగిన జాగ్రత్తలు తీసుకోని ఫలితమే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లోని తొక్కిసలాట అని స్పష్టమైంది. ప్రజల కన్నా ప్రచారమూ, రాజకీయ ప్రయోజనమూ ముఖ్యమన్న ధోరణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెంటి వద్దా వ్యక్తం కావటం విచారకరం. మొదటి తొక్కిసలాటలో భక్తులు చనిపోతే ఎంతమంది చనిపోయారో, ఎంతమంది గాయపడ్డారో 14 గంటల వరకూ సమాచారం బయటికి రాలేదు. కానీ, ఏరోజుకు ఆరోజు ఎంతమంది స్నానాలు ఆచరించారో ఠంచనుగా లెక్కలు విడుదల చేశారు. ఇంత పెద్ద కార్యక్రమంలో తొక్కిసలాట మామూలేనంటూ ఆ రాష్ట్రమంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. నదీజలం తీవ్రంగా కలుషితమైందని, ప్రమాదకరమైన బ్యాక్టీరియాతో నిండిపోయిందని సాక్షాత్తూ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ పరిశోధనపూర్వక నివేదికను వెల్లడిస్తే- అదంతా తప్పన్నట్టు ముఖ్యమంత్రి యోగి కొట్టిపారేశారు. నదీజలం స్నానానికే కాదుబీ తాగటానికి కూడా స్వచ్ఛంగా ఉందంటూ ఉద్ఘోషించారు. కుంభమేళాలో స్నానమాచరించని రాహూల్‌గాంధీ, ఉద్ధవ్ థాకరేకి హిందువులు ఓట్లు వేయరాదంటూ కేంద్రమంత్రి రాందాస్ అథవాలే అథమస్థాయి వ్యాఖ్యలు చేశారు. నోట్లరద్దుతో క్యూలో నిల్చొని జనం ప్రాణాలు వదిలినప్పుడు, ఆకస్మిక లాక్‌డౌన్‌తో కోట్లాదిమంది కార్మికులు నానా ఇక్కట్లూ పడినప్పుడు, రోడ్లపై నడుస్తూనే ప్రాణాలు కోల్పోయినప్పుడు, మణిపూర్‌లో మహిళలను నగంగా ఊరేగించి, హత్యాచారాలకు పాల్పడినప్పుడు నోరు విప్పని, క్షమాపణ కోరని ప్రధాని మోడీ కుంభమేళాలో జరిగిన అసౌకర్యాలకు చింతిస్తూ, క్షమాపణలు కోరారు. ఇదంతా దేనిని సూచిస్తోంది? భక్తుల విశ్వాసాలను రాజకీయ లబ్ధిగా మార్చుకునే బిజెపి కుటిల, కుత్సిత, స్వార్థబుద్ధిని బయట పెడుతోంది. ప్రజలను మతం పేరిట విడదీసి, పబ్బం గడుపుకునే ఏహ్యమైన పాచిక కనపడుతోంది. దైనందిన బతుకులో భారాలకు, సమస్యలకు కారణమవుతూ, మతవిశ్వాసాలు, ఉద్వేగాల హంగామాతో దానిని మభ్యపెట్టాలని పాలకుల పన్నాగం. ప్రజలు దానిని అర్థం చేసుకోలేరనుకుంటే అది అజ్ఞానమే అవుతుంది.

# శుక్రవారం ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ, LRS పై రాష్ట ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం,అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సంబంధిత అధికారులు.






శుక్రవారం ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ, LRS పై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం, తదితరులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు వచ్చే నెల మార్చి 5వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షల ఏర్పాట్ల పై సమీక్షిస్తూ ఎలాంటి పొరపాట్లకు, కాపీయింగ్ కు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాలలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లను అనుమతించకూడదని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్ లతో పాటు కేంద్రాలను తనిఖీ చేసేందుకు వెళ్లే అధికారులు సైతం సెల్ ఫోన్ లు తీసుకెళ్లకూడదని ఆదేశించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతనే లోనికి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ పరీక్షల నిర్వహణ పై వివిధ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తీసుకురావడం మొదలుకుని, పరీక్షలు ముగిసిన మీదట ఆన్సర్ షీట్లను నిర్ణీత పాయింట్ కు తరలించేంతవరకు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి కేంద్రంలోనూ పరీక్షల నిర్వహణ తీరును చీఫ్ సూపరింటెండెంట్ లు నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.పరీక్ష కేంద్రాలలో తాగునీటి వసతి, సరిపడా ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని,

పరీక్షా సమయాల కనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని , పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ద్వార కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీఓ వినోద్ కుమార్, SC ట్రాన్స్కో, ప్రిన్సిపల్, dlpo,, డీఎంహెచ్ఓ , కలెక్టరేట్ AO, తదితరులు పాల్గొన్నారు.

# నార్నూర్ మండలంలో పర్యటించిన జిల్లా పాలనాదికారి రాజర్షి షా.







అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ శుక్రవారం నార్నూర్ మండలం తడిహత్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో. డిజిటల్ క్లాస్ రూమ్ , లైబ్రరీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, విద్యార్థులలో పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, తడిహత్నూర్ శివారులో HDFC బ్యాంక్ ఆద్వర్యం లో నాటిన వివిధ రకాల మొక్కల పరిశీలన , అనంతరం నార్నూర్ మండలం లోని వివేకానంద స్కూల్ ఎదురుగా ఉన్న ఫంక్షన్ హాల్ లో HDFC ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని ఛాయ చిత్ర ప్రదర్శన ను తిలకించిన జిల్లా పాలనాదికారి రాజర్షి షా. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నార్నూర్ మండలాన్ని అభివృద్ధి పథం లో ముందుకు తీసుకెళ్లేందుకు( విద్యా, వైద్యం, తదితర రంగాల్లో)HDFC బ్యాంక్ సహయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం నార్నూర్‌లో భాగంగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బీఏఐఎఫ్ సంస్థ సహకారంతో వివిధ అభివృద్ధి కార్యక్రమంలో డిజిటల్ తరగతి గదులు, గ్రంథాలయాలు, వాడి తోటల ప్రాజెక్ట్, సహజ వనరుల నిర్వహణ (NRM) , సోలార్ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నరు. ఈ కార్యక్రమంలో జ హెచ్‌డీఎఫ్‌సీ ప్రాంతీయ డైరెక్టర్, బీఏఐఎఫ్ రాష్ట్ర అధికారి పాల్గొని, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న ఈ సమగ్ర ప్రాజెక్ట్‌ను ప్రోత్సహించడం జరిగిందన్నారు. గ్రంథాలయాన్ని ప్రారంభించి విద్యార్థులతో పాఠాలను చదివించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సరిగా చదువుతున్నారా లేదా చూడాలని , దగ్గరుండి చదివించి, అర్థం కాని వాటి పై అవగాహన కల్పించాలని అన్నారు.ల విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలని, తెలియని విషయాలను తెలుసుకోవాలన్నారు. తడిహత్నూర్ శివారులో దాదాపు మూడు ఎకరాలకు పైగా ఉన్న చేనులో పండిస్తున్న వివిధ రకాల పండ్లు, కూరగాయలు ఆకుకూరలు వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో HDFC బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటేష్ చల్లవార్, జోనల్ హెడ్ కరుణాకర్ రెడ్డి, ల Csr teem asia Syed, స్టేట్ హెడ్ హేమంత్, mro, ఎంపిడిఒ, తదితరులు పాల్గొన్నారు.ల జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# జిల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడిహత్నూర్ ని సందర్శించి, BAIF NGO సంస్థ ద్వారా నిధులు సమకూర్చిన డిజిటల్ క్లాస్ రూమ్, వాటర్ ఫిల్టర్ యూనిట్, లైబ్రరీని శుక్రవారం ప్రారంభించారు.







అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసుల విద్యాబోధన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం నార్నూ ర్ మండలం తాడిహత్నూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల లో డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. డిజిటల్ క్లాస్ రూమ్ సదుపాయాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ వారి ఆర్థిక సహాయంతో సీఎస్ఆర్ నిధులతో మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులకు ఆధునిక విద్య అందించే దిశగా ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న వసతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని,విద్య పై అధిక శ్రద్ధ వహిస్తూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని అన్నారు. అనంతరం నిర్మాణం లో ఉన్న పనులను పరిశీలించారు ఇందులో ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం..



జన్నారం. :అమృత్ తెలంగాణ: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పొనకల్ నందు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ నందు విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సందర్శకులకు వారి చేసిన పలు కృత్యాలను వివరించారు. అనంతరం సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి సైన్స్ పై మక్కువ పెంచాలని ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులకు చూపించారు. ఉపాధ్యాయులు నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో చైర్-పర్సన్ రేణుకా, హెచ్. ఎం కె.రాజేశం, ఉపాధ్యాయులు శ్రీకాంత్, వనిత, సుజాత, దీవెన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# నారాయణ ఒలంపియాడ్ లో జాతీయ విజ్ఞాన దినోత్సవం వేడుకలు..





కందుకూరు అమృత్ తెలంగాణ: ఫిబ్రవరి 28:- స్థానిక కందుకూరులోని కోవూరు రోడ్ లో ఉన్న నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి వారి సృజనాత్మకతతో అనేక ఎక్స్పరిమెంట్స్ తో చూపరులను ఆశ్చర్య చెకితులను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రకాశం జిల్లా నారాయణ పాఠశాలల ఏజీఎం పెద్దిరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన సి.వి.రామన్ లాంటి గొప్ప వ్యక్తుల గురించి వారు ఈ దేశానికి అందించిన సేవను గురించి విద్యార్థులకు తెలియజేయడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తి భావాలు ఏర్పడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ సుభాని మాట్లాడుతూ ఈరోజు సైన్స్ డే జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితియ వచ్చునని రామన్ ఎఫెక్ట్ గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి , హై స్కూల్ కోఆర్డినేటర్ శ్రీహరి , ఈ ఛాంప్స్ కోఆర్డినేటర్ స్వాతి , సాఫ్ట్ స్కిల్ కోఆర్డినేటర్ సాదిక్ , డీన్ రాము , వైస్ ప్రిన్సిపల్ ఆషా క్రాంతి మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య లో ఘనంగా సైన్స్ ఎక్స్ పో



కందుకూరు అమృత్ తెలంగాణ: ఫిబ్రవరి 28 :- కందుకూరు పట్టణములోని కోటారెడ్డి నగర్ లో ఉన్న శ్రీ చైతన్య హైస్కూలు లో "నేషనల్ సైన్స్ డే"ను శుక్రవారము పాఠశాల ఆవరణ లో సైన్స్ ఎక్స్ పో ని ఘనముగా నిర్వహించారు. ఈ కార్యక్రమము శ్రీ చైతన్య హైస్కూలు ప్రిన్సిపల్ బి.సురేష్ ఆధ్వరంలో డా.జి.ప్రసాద్ బాబు సీనియర్ శాస్త్రవేత్త/ హెడ్, (కృషి విజ్ఞాన కేంద్రం - కందుకూరు, భారత వ్యవసాయ పరిశోధన మండలి - కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ) ముఖ్య అతిధి విచ్చేసి వివిధ విజ్ఞానిక నమూనాలను వీక్షించి విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ నేటి విద్యార్థులు నోబెల్ బహుమతి గ్రహీత, భారత రత్న సి.వి రామన్ అడుగు జాడలలో నడుస్తూ ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకుని నూతన అవిష్కరణలు ఎన్నో కనుగొని భారత దేశ కీర్తికి ప్రపంచానికి చాటాలని అన్నారు. ఉత్తమ



సైన్సు నమూనాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్.ఐ వై అనిల్ కుమార్, కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసులు, అకడమిక్ డీన్ జి.బ్రహ్మయ్య, సైన్సు టీచర్లు, ఎ.ఓ సురేష్ నాయుడు విద్యార్థిని - విద్యార్థులు మరియు ఉపాధ్యాయిని - ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం





కందుకూరు అమృత్ తెలంగాణ: ఫిబ్రవరి 28:- కందుకూరు టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి), భౌతిక శాస్త్ర విభాగం మరియు జీవశాస్త్ర విభాగ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎం.రవికుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సైన్స్ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఎంతగానో ఉపకరిస్తుందని, తద్వారా మానవజాతి ఎంతో పురోగతి సాధించిందని అభిప్రాయపడ్డారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్.వి.శ్రీహరి విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవం విశిష్టతను, రామన్ ఫలితాన్ని తెలియజేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ కలను సాకారం చేయడం కోసం, నూతన సైన్స్ ఆవిష్కరణలలో ప్రపంచంలోనే భారతదేశం ముందువరుసులో ఉండడం కోసం, భారతీయ యువతకు సాధికారత కల్పించడం అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవం జరుగుతున్నది ఆయన తెలియజేశారు. సైన్స్ యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర, భౌతిక శాస్త్ర అధ్యాపకులు కృష్ణ శర్మ తెలియజేశారు. ఈ సందర్భంగా జంతుశాస్త్ర విభాగం వారు ఎగ్జిబిషన్ ను నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని, సైన్స్ లేబరేటరీలలో పొందుపరిచిన సైన్స్ పరికరాలను, సాంకేతిక వస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.కమల బాబు, డాక్టర్ పద్మావతి, ఏ.హనుమంతరావు, డాక్టర్ తిరుపతి స్వామి, డాక్టర్ అనూష, ఎం.జ్యోతి, కే.శ్రీనివాసులు, జీ.బ్రహ్మయ్య మరియు ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సంస్కృతి స్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు





కందుకూరుఅమృత్ తెలంగాణ:ఫిబ్రవరి 28 :- కందుకూరు పట్టణంలోని గుర్రం వారి వీధి లోని శ్రీ సంస్కృతి పాఠశాలలో శుక్రవారంజాతీయసైన్స్‌దినోత్సవమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సి.వి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.తరువాత 1వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు సైన్స్ డే లో అన్ని సబ్జెక్టుల నుండి వివిధ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్లు మహబూబ్ ఖాన్,హరి, అబ్దుల్ షుకూర్ శ్రీనివాసులు ,శ్రావణి విద్యార్థులు పాల్గొని రామన్ ప్రభావం యొక్క సూత్రాలను అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు క్విజ్ లు, చర్చలు నిర్వహించి విద్యార్థులు ఆచరణాత్మక ప్రయోగాలలో పాల్గొనేవిధంగాచేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత గడ్డపైనే చదువుకుని తలమానికమైన పరిశోధనలు జరిపి సైన్స్ లో దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పిన మేధావి సి.వి రామన్ గారని విద్యార్థులు కూడాశాస్త్రీయ దృక్పథాన్ని అభిరుచిని పెంపొందించుకొని మీలో నుండి కూడా మరొక సి.వి రామన్ తయారు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్స్ పాల్ డి శివ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి మరియు ఉపాధ్యాయులు పాల్గొని వివిధ శాస్త్రవేత్తలు గురించి తెలియజేశారు.

# కవ్వించే చూపులతో ముద్దుగుమ్మ 'మనసుకు నచ్చింది'



సినిమాతో అమైరా దస్తూర్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయింది. ఆ సినిమా నిరాశ పరచడంతో తెలుగులో పెద్దగా ఆఫర్లు రాలేదు. 'మనసుకు నచ్చింది' సినిమాతో అమైరా దస్తూర్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయింది. ఆ సినిమా నిరాశ పరచడంతో తెలుగులో పెద్దగా ఆఫర్లు రాలేదు. రాజ్ తరుణ్ తో కలిసి రాజుగాడు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అమైరాకి ఆ సినిమా నిరాశను మిగిల్చింది. రాజు గాడు సినిమా తర్వాత తెలుగులో ఈ అమ్మడు పెద్దగా కనిపించలేదు. కానీ హిందీ, తమిళ్ సినిమాల్లో ఈమెకు అడపా దడపా ఆఫర్లు వస్తున్నాయి. హిందీలో ఈ అమ్మడు ప్రస్థానం, జడ్జిమెంటల్ హై క్యా, కోయి జానే నా, జోగి, ఇన్ఫ్లుయెన్సర్ లైఫ్ సినిమాల్లో నటించింది. అవేవి ఈ అమ్మడికి స్టార్‌డంను తెచ్చి పెట్టలేక పోయాయి. గత సంవత్సరం పుర్టీలా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆడకపోవడంతో మళ్లీ ఆఫర్ల కోసం ఈ అమ్మడు ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి. అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అయిన బంబై మేరీ జాన్ సిరీస్‌లో ఈమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ తర్వాత ఒకటి రెండు వెబ్ సిరీస్‌ల్లో ఆఫర్లు వచ్చినా వాటికి అమైరా ఓకే చెప్పలేదు. హీరోయిన్‌గా మాత్రమే సినిమాను చేయాలని ఈ అమ్మడు ఆశ పడింది. కానీ హీరోయిన్‌గా ఈ అమ్మడికి ఆఫర్లు దక్కడం లేదు. కానీ సోషల్ మీడియా ద్వారా ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో స్టార్ హీరోయిన్స్ రేంజ్‌లో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసే అమైరా దస్తూర్ కి దాదాపుగా 3.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. వెండి తెరపై అందాల ఆరబోత చేసే అవకాశం దక్కక పోయినా ఇలా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన అందాల ఆరబోత ఫోటోలను అమైరా దస్తూర్ రెగ్యులర్‌గా షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు ఈ ఫోటోలతో కన్నుల విందు చేసింది. కవ్వించే విధంగా చూస్తూ ముద్దుగుమ్మ చూపు తిప్పుకోనివ్వడం లేదు.


# మార్చి ముగింపులో బన్నీ క్లారిటీ ఇచ్చేస్తాడా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమా విషయంలో స్పష్టత లోపించిన సంగతి తెలిసిందే. రేసులో అట్లీ..త్రివిక్రమ్ పోటీ పడటంతో? బన్నీ ముందుగా ఏ డైరెక్టర్ కి డేట్లు ఇస్తాడు? అన్నది చెప్పలేని పరిస్థితి. ఇద్దరు స్టోరీలు సిద్ధం చేసుకుని రెడీగా ఉన్నారు. బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇస్తే పట్టాలెక్కించాలని చూస్తున్నారు. కానీ ఆయన నుంచి మాత్రం ఇంత వరకూ సరైన క్లారిటీ రాలేదు. ఈ నేపథ్యంలో బన్నీ లైనప్ పై మరో నెల రోజుల్లో పూర్తి క్లారిటీ వచ్చేస్తుందని నిర్మాత బన్నీవాస్ వెల్లడించాడు.

తదుపరి బన్నీ చేసే సినిమాలన్నీ లైన్ గా ఆయనే స్వయంగా వెల్లడిస్తారని తెలిపారు. అందుకు పెద్దగా సమయం కూడా తీసుకోరని అన్నారు. అంటే మార్చి నెల ముగింపు నుంచి ఏప్రిల్ మొదటి వారానికి ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. అలాగే బన్నీ వాస్ మాటల్ని బట్టి బన్నీ కేవలం ఒక్క ప్రాజెక్ట్ అనౌన్స్ చేయడని....ఓ ఆర్డర్ ప్రకారం ప్రాజెక్ట్ వివరాలు వెల్లడిస్తాడని తెలుస్తోంది. ఇలా క్లారిటీ ఇస్తే ఎలాంటి గందరగోళం ఉండదు. ఏ సినిమా తర్వాత ఎవరి సినిమా ప్రారంభమ వుతుంద న్నది అభిమానులకు ఓఐడియా ఉంటుంది. సోషల్ మీడియాలో అవనసర చర్చకు అవకాశం ఉండదనే బన్నీ ఇలా డిసైడ్ అయినట్లు బన్నీ వాస్ మాటల్ని బట్టి తెలుస్తుంది. సంధ్యా థియేటర్ ఘటన తర్వాత బన్నీ తీవ్ర మనస్తాపానికి గురైన సంగతి తెలిసిందే. అటుపై పోలీసు కేసు..కోర్టు అంటూ ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో పుష్ప-2 జయోత్సవాన్ని కూడా బన్నీ సంతోషంగా సెలబ్రేట్ చేసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో కొత్త సినిమాల గురించి ఇంకే ఆలోచించగలరు. ఇప్పుడిప్పుడే ఆ పెయిన్ నుంచి బయట పడుతున్నారు. బన్నీ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినా అది వేసవి తర్వాతే మొదలయ్యే అవకాశాలున్నాయని సన్నిహితుల సమాచారం.

# నాగార్జున కూడా ఇంత లేట్ అయితే ఎలా..?



టాలీవుడ్ కింగ్ నాగార్జున నా సామిరంగ సినిమా తర్వాత నెక్స్ట్ ప్రాజెక్ట్ ని ఫైనల్ చేయడానికి టైం తీసుకుంటున్నారు. టాలీవుడ్ కింగ్ నాగార్జున నా సామిరంగ సినిమా తర్వాత నెక్స్ట్ ప్రాజెక్ట్ ని ఫైనల్ చేయడానికి టైం తీసుకుంటున్నారు. ఓ పక్క కోలీవుడ్ లో కూలీ సినిమాలో ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నాడు నాగ్. దాదాపు అది నెగిటివ్ రోల్ అన్న టాక్ వినిపిస్తుంది. అయినా సరే లోకేష్ కనకరాజ్ సినిమా కాబట్టి ఆ పాత్రలో నాగార్జున ఎలా ఉంటారా అన్న ఆసక్తి ఫ్యాన్స్ లో ఉంది. మరోపక్క కుబేర సినిమా కూడా చేస్తున్నాడు. ధనుష్ హీరోగా వస్తున్న కుబేర సినిమాలో కూడా నాగార్జున కీలక పాత్ర చేస్తున్నట్టు తెలుస్తుంది. ధనుష్ కుబేరల్లో కథను మలుపు తిప్పే పాత్ర కాబట్టే నాగార్జున ఒప్పుకున్నారని తెలుస్తుంది. ఐతే తమిళ్ లో రెండు సినిమాలు చేస్తున్న నాగ్ తెలుగులో ఒక్క సినిమాను మొదలు పెట్టలేదు. నాగార్జున లాంటి సీనియర్ హీరో కూడా కథల ఎంపికలో ఇంత లేట్ చేయడం ఫ్యాన్స్ ని ఇబ్బంది పెడుతుంది. అక్కినేని ఫ్యాన్స్ కూడా నాగార్జున చేస్తున్న ఈ లేట్ కి అసంతృప్తిగా ఉన్నారు. అఖిల్ కూడా ఏజెంట్ వచ్చి రెండేళ్లు దాటినా మరో సినిమా ఊసేలేదు. నాగార్జున కూడా అదే దారిలో వెళ్తున్నారు. మరి ఇలా ఎందుకు జరుగుతుంది అని అక్కినేని ఫ్యాన్స్ కన్ ఫ్యూజన్ లో ఉన్నారు. మరోపక్క నాగ చైతన్య తండేల్ తో 100 కోట్ల సినిమా చేశాడు. తండేల్ సక్సెస్ తో అక్కినేని ఫ్యాన్స్ లో జోష్ మొదలైంది. నాగార్జున, అఖిల్ టైం పాస్ చేస్తున్నా నాగ చైతన్య మాత్రం సినిమా వెంట సినిమా చేస్తూ వస్తున్నాడు. సముద్రపు లోతుల్లో అంతుచిక్కని రహస్యం నాగార్జున నెక్స్ట్ సినిమా కోసం ఫ్యాన్స్ అంతా ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఒకరిద్దరు దర్శకులతో కథా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తున్నా ఏది ఫైనల్ అవ్వకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరుత్సాహంగా ఉన్నారు. మరి నాగార్జున నెక్స్ట్ సినిమా ఏది అవుతుంది ఎవరి డైరెక్షన్ లో వస్తుంది అన్నది చూడాలి. నాగార్జున మాత్రం ఈసారి కూడా కొడితే సూపర్ హిట్టే కొట్టాలి






## సీరత్‌కపూర్ హాట్ ఇన్ బ్లూ

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com